క్లుప్తంగా

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ తదితరులు

టేక్మాల్(మెదక్): పీఆర్టీయూ టేక్మాల్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన డైరీని తహసీల్దార్ తులసీరాం గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండల శాఖ అధ్యక్షులు ఎండీ అమీరుద్దీన్, మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ.దుర్గయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.బాల్య, జిల్లా బాధ్యులు బి.వినోద్ కుమార్, కృష్ణ, ఎం సతీష్ రావు, నాగరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సీసీ రోడ్డు పనులు



సీసీ పనులను పరిశీలిస్తున్న గ్రామస్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామంలో గురువారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. యాదవ కాలనీలో నిర్మించే సీసీ రోడ్డు పనులు రూ.10 లక్షలు ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు గుత్తేదారు శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.

17నుంచి ఆలయ వార్షికోత్సవాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శ్రీ శీతల మాత దేవాలయ వార్షికోత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి రెండు రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. గురువారం వార్షికోత్సవం వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఆ రోజు లక్ష పుష్పార్చన, అమ్మవారి ఊరేగింపు, 18న చండీయాగం, సామూహిక బోనాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. పూజల సందర్భంగా భక్తులకు నిరంతరం తీర్థప్రసాదాలు అన్నప్రసాద వితరణ కొనసాగుతుందని చెప్పారు.

ఫాతిమా సేవలు భేష్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

నర్సాపూర్: ప్రభుత్వ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో గురువారం మొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నసీమా షేక్ మాట్లాడుతూ ఫాతిమా షేక్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల అధ్యక్షుడిగా శ్రీకాంత్



కార్యవర్గ సమావేశం

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్‌లో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల నూతన మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ తెలిపారు. నూతన అధ్యక్షుడిగా తలారి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా స్వామి, కార్యదర్శి భాస్కర్, సహాయ కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా కర్రె కృష్ణ, కమిటీ సభ్యులుగా యాదమ్మ, ఇందిర, లక్ష్మీ, బాలమణి, పుష్ప, మైసమ్మ, అర్జున్, ఆండాలు, ముత్యాలమ్మ, శోభలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ముగిసిన బీజేపీ సంస్థాగత ఎన్నికలు



కార్యవర్గ సమావేశం

మెదక్‌జోన్: బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా గురువారం ఆ పార్టీ జిల్లా నేతల సమక్షంలో ఆయా మండలాల అధ్యక్షులను, జిల్లా కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మెదక్ పట్టణ అధ్యక్షుడిగా నాయిని ప్రసాద్, మెదక్ మండల అధ్యక్షురాలిగా బెండె వీణతోపాటు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా శివకుమార్, ప్రభాకర్, అశోక్ తదితరులు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

రహదారిపై డబ్బాలు తొలగించండి



ఆందోళన చేస్తున్న తిరుమలాపూర్ కాలనీ వాసులు

పెద్దశంకరంపేట(మెదక్): తిరుమలాపూర్ ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో అక్రమంగా వెలిసిన డబ్బాలను తొలగించాలంటూ మెదక్–నార్సింగ్ రహదారిపై కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బాలతో తమ కాలనీలోనికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. సుమారు గంట పాటు ఆందోళన చేపట్టడంతో రహదారి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పి వారిని సముదాయించారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

పాపన్నపేట(మెదక్): సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఫిబ్రవరి 15న సెలవు ప్రకటించాలని బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫూల్‌సింగ్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం పాపన్నపేటలోని ప్రభుత్వ విద్యాసంస్థలో బంజార విద్యార్థులతో కలిసి ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్టుకార్డులను రాశారు. కార్యక్రమంలో రాజు నాయక్, రమేష్‌నాయక్, సక్రు, రెడ్యా, మోహన్, తుకారం, సురేష్, ఖమ్రు, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది కొరత.. వసతుల లేమి!

అగ్నిమాపక కేంద్రం అధ్వానంగా మారింది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో పాటు కనీస వసతులు కరువయ్యాయి. నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో 2009లో ఫైర్‌అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. దానిని ఇటీవలే పూర్తిస్థాయి ఫైర్‌స్టేషన్‌గా అభివృద్ధి చేశారు. అయితే వసతులు కల్పించడంలో మాత్రం విఫలమయ్యారు.

- నర్సాపూర్ ఫైర్‌స్టేషన్ దుస్థితి
- ఒకే గదిలో కొనసాగుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది



నర్సాపూర్ ఫైర్‌స్టేషన్

నర్సాపూర్: నియోజకవర్గంలోని హత్నూర, శివ్వంపేట మండలాల్లో పలు పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో అగ్ని ప్రమాద ఘటనలు జరిగినప్పుడు సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంతాల నుంచి ఫైరింజన్లు వచ్చి మంటలు ఆర్పేందుకు చర్యలు తీసుకునేది. ఆయా పట్టణాలు దూరం కావడంతో ఫైరింజన్లు వచ్చేసరికి అగ్నిప్రమాద ఘటనలో ఎక్కువ నష్టం సంభవించడంతో 2009లో నర్సాపూర్‌లో ఫైర్ అవుట్‌పోస్టును ఏర్పాటు చేసి ఫైరింజన్ సేవలను నియోజకవర్గ ప్రజలకు దగ్గర చేశారు. అయితే ఫైర్ ఆఫీసర్‌తో కలిపి 16 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 12 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. వారిలో ఆరుగురు రెస్ట్‌లో ఉంటుండగా.. మరో ఆరుగురు విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం విధుల్లో ఉన్న వారిపై పని భారం పడుతుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకటే ఫైరింజన్ ఉండగా, వారం రోజుల క్రితం మరో ఫైరింజన్ మంజూరు చేసి అందుబాటులోకి తెచ్చారు. కాగా ఫైర్‌స్టేషన్‌గా అభివృద్ధి చేసినప్పటికీ కనీస వసతులు కల్పించలేదు. చిన్నపాటి గదిలోనే సిబ్బంది, అధికారి ఉండడం, రెస్ట్ తీసుకోవాల్సి రావడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఫైర్‌స్టేషన్ కార్యాలయ భవనం, సిబ్బందికి రెస్ట్ రూం, టాయిలెట్స్, ఫైరింజన్లకు షెడ్లు, ఇతర సదుపాయలతో కూడిన భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

నర్సాపూర్ ఫైర్‌స్టేషన్‌లో భవనం, ఇతర సదుపాయలు కల్పించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే భవనం ఇతర సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరలోనే నిధులు మంజూరవుతాయని అనుకుంటున్నాం.

– వేణు, జిల్లా ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశం

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఎంఈఓ వెంకటేశం ప్రధానోపాధ్యాయులకు సూచించారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో హెచ్‌ఎంలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలు బడిలో ఉండాలని, దీనిలో భాగంగా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలని ఆదేశించారు. మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అపార్ కార్డుల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు విజయ్‌కుమార్, విఠల్, ఎమ్మార్సీ సిబ్బంది సంపత్‌రెడ్డి, సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



టీవీని అందజేస్తున్న దృశ్యం

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండల పరిధిలోని నర్సింగరావు పల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు సంధ్యారాణి టీవీని బహూకరించారు. మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా టీవీని గురువారం అందజేశారు. బదిలీపై వెళుతున్న సంధ్యారాణికి పాఠశాల ఉపాధ్యాయులు వీడ్కోలు పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చిరంజీవి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు, పాపన్నపేట హెచ్‌ఎం మహేశ్వర్‌తో పాటు ఉపాధ్యాయులు అజయ్, మౌనిక పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షులు వీరే



అవినాశ్‌రెడ్డి



దాసు



వెంకటేష్‌గౌడ్



హరీశ్



రాకేష్



జానకిరాంగౌడ్



రవి

సాక్షి, నెట్‌వర్క్: బీజేపీ మండల శాఖ అధ్యక్షులను ఆ పార్టీ ప్రకటించింది. శివ్వంపేట అధ్యక్షుడిగా రవి, తూప్రాన్ పట్టణ అధ్యక్షుడిగా భూమన్నగారి జానకిరామ్‌గౌడ్, కొడిపల్లి మండల అధ్యక్షుడిగా కాజిపేట రాకేష్, కొల్చారం అధ్యక్షుడిగా పంతులు హరీశ్, మనోహరాబాద్ అధ్యక్షుడిగా బక్క వెంకటేష్‌గౌడ్,, వెల్దుర్తి అధ్యక్షుడిగా పడిగె దాసు, రామాయంపేట పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా శీలం అవినాశ్‌రెడ్డిలను నియమించారు. తమపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. రెండో రోజు గణపతి పూజ, గరుడ వాహన పూజా కార్యక్రమాలు భక్తి, శ్రద్ధలతో చేపట్టారు. భక్తుల కోలాటలు, గోవింద నామస్మరణతో ఆలయం మారుమోగింది. శుక్రవారం జరిగే ఉత్తరద్వారా దర్శనం కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు ప్రత్యేక పూజలు

నర్సాపూర్: నర్సాపూర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన స్వర్ణధామ నగర్‌లో శ్రీ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్మాణదాత రాఘవేందర్ రావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి ఆశీర్వాదం పొందాలని కోరారు.

ప్రత్యేక తరగతులు ప్రారంభం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. శివ్వంపేట మండలంలోని పది ఉన్నత పాఠశాలల్లో 499 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో అదనంగా గంట పాటు విద్యార్థులకు బోధన చేస్తున్నారు. సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు దాతలు ముందుకు రావాలని శివ్వంపేట పాఠశాల హెచ్‌ఎం బాలచంద్రం కోరారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజాదర్బార్

కొడిపల్లి(నర్సాపూర్): ఈనెల 10వ తేదీన కొడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. రూ.9కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి బృందం గ్రామాలలో తనిఖీలు నిర్వహించనట్లు తెలిపారు. వివరాలను ప్రజాదర్బార్‌లో వివరించనున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేటలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో పంచాయతీ కార్య దర్శి రాజిరెడ్డి సర్వే చేప ట్టారు. కాగా ఎంపీడీఓ తన మొబైల్ ద్వారా లాగిన్‌లో సర్వేను తనిఖీ చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తప్పులు లేకుండా సర్వే చేసేందుకు ఆకస్మింగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.



విహారయాత్రలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విహారయాత్రలతో విజ్ఞానం

వెల్దుర్తి(తూప్రాన్) : మండలంలోని మానెపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రెండు రోజుల పాటు విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఆర్థికసాయంతో విద్యార్థులకు నాగార్జునసాగర్, మ్యూజియం, ఆచార్య నాగార్జున కొండ, లాంచి ప్రయాణం, చార్మినార్, సాలార్‌జంగ్‌మ్యూజియం, బిర్లా మందిర్, నక్షత్రశాల, ఎన్టీఆర్ గార్డెన్ వంటి వాటిని చూపించినట్లు హెచ్‌ఎం కౌసల్య తెలిపారు. విహారయాత్ర వల్ల విద్యార్థులకు విజ్ఞానం కలుగుతుందన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిజాంపేట(మెదక్): ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ, వ్యవసాయశాఖ, లివ్‌పామ్ రిసోర్సెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంట సాగు చేయాలన్నారు. దీంతో రెట్టింపు ఆదాయం పొందవచ్చని, ఒక ఎకరా వరి వేసే నీళ్లతో 5 ఎకరాల ఆయిల్ పామ్ పండించవచ్చాన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మొక్కలపై రాయితీతో పాటు 4 ఏళ్ల తోట నిర్వహణ, అంతర పంటల సాగుకు రాయితీ రూ.26,450 సొమ్మును రైతుల ఖాతాకు జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి. వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీలత, మౌనిక, రమ్య, ఆయిల్ పామ్ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'ప్రమాదాల నివారణ అందరి బాధ్యత'



శివ్వంపేట పాఠశాలలో ముగ్గులు వేసిన విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ పోగ్రాం అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా గురువారం శివ్వంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. రోడ్డు నిబంధనలు పాటించాలని వాహనాలు నడిపేటప్పుడు రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు నర్సింహశర్మ, రాధ, శేక్రు, ఈశ్వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన గీతా విద్యార్థులు

జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు వీరే..

హవేళిఘణాపూర్(మెదక్): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మెదక్ మండలం మంభోజిపల్లి గీతా హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభచాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో అంజనశ్రీ, మనూష, యమున, హారిణిలు రాణించారని తెలిపారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. గీతా స్కూల్ పాఠశాల పేరునే కాకుండా మెదక్ జిల్లా పేరును జాతీయ స్థాయికి తీసుకెళ్లిన విద్యార్థినులను అభినందించారు. విద్యార్థులంటే కేవలం పుస్తకాల చదువులకే పరిమితం కాకుండా సాంకేతిక రంగంలో రాణిస్తూ అధునాతన ప్రదర్శనల ద్వారా ముందుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంను వినియోగించుకుంటూ సాంకేతిక రంగంలో భాగస్వాములై మంచి పేరు ప్రతిష్టలు సంపాదించాలని ఆయన విద్యార్థులకు ఉద్బోధించారు.

డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు



పోటీలను పరిశీలిస్తున్న అధ్యాపకులు

నర్సాపూర్ రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి స్వాతి (బీజెడ్‌సీ), రెండో బహుమతి సాధిక (బీకాం), తృతీయ బహుమతి శ్రీవాణి (బీజెడ్‌సీ) దక్కించుకున్నారు. రేవతి, పూజితులకు బహుమతులు అందుకున్నవారిలో ఉన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సమీరా నాజినీను, అధ్యాపకులు అనిత, డాక్టర్ ఆర్.సురేష్, మినీ చంద్రకళ పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే ఆరోగ్యం: డీపీఓ

నర్సాపూర్: ఒత్తిడిని జయిస్తేనే ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉంటారని డీపీఓ యాదయ్య అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన మానసిక వత్తిడిని ఎలా అధిగమించాలి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు సీడీపీఓ హెమబార్గవి, ఎంపీడీఓ మధులత తదితరులతో పాటు ఆయా శాఖలకు సిబ్బంది పాల్గొన్నారు. సైకాలజిస్టు సునీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తాము చేసే పనులలో భయాన్ని తొలగించుకుని ముందుకు సాగాలని ఆమె సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ గుండెపోటుతో విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

చేగుంట(తూప్రాన్): చేగుంటకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వరుగంటి నాగరాజు(75) గురువారం కన్నుమూశారు. ప్రధానోపాధ్యాయుడిగా కస్తూర్బా పాఠశాల ఎస్‌ఓగా, లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యుడిగా, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యుడిగా నాగరాజు పలు సేవలు అందించారు. ఆయన మృతిపట్ల లయన్స్ అధ్యక్షుడు నాగరాజు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింలు, కాంగ్రెస్ నాయకులు పరంజ్యోతి సంతాపం వ్యక్తం చేశారు.

◆ ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి

చేగుంట(తూప్రాన్): గ్రామీణ యువత ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని ఎంపీడీఓ చిన్నారెడ్డి అన్నారు. గురువారం వడియారంలో బీఎస్ఆర్ గార్మెంట్స్ కుటీర పరిశ్రమ 25వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన ఉపాధితో భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగవచ్చని చెప్పారు. ఎస్‌బీఐ బ్రాంచీ మేనేజర్ మన్యా నాయక్ మాట్లాడుతూ.. చిన్నతరహా పరిశ్రమలకు రుణాలు అందిస్తామన్నారు. అనంతరం కుటీర పరిశ్రమ సిల్వర్ జూబ్లీ లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం లక్ష్మినర్సమ్మ, నిర్వాహకులు సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని కే.వెంకటపూర్‌కు చెందిన ఆంజనేయులు, బుజేందర్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ అందజేశారు. హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటపూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దయాకర్, బీబీపేట ఎంపీపీ బాలమణి, మహిపాల్, రాజు పిట్ల, డప్పు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్) : సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుకునూర్ గ్రామానికి చెందిన రవి, రమ, సత్తయ్యలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, మల్లేశం, హన్మేష, వెంకటరెడ్డి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

◆ నిత్యావసర సరుకుల పంపిణీ

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో గ్రామ పంచాయతీ కార్మికులకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి పంపిణీ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఇద్దరు కార్మికులకు పప్పులు, సబ్బులు, బెల్లం, నూనె ఇతర వస్తువులను అందచేసినట్లు తెలిపారు.

◆ నర్సరీ పనులు ప్రారంభించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని ప్రతీ గ్రామంలో నర్సరీ పనులు ప్రారంభించాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాయలంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీ పనులు పరిశీలించి, పాలిథిన్ కవర్లలో విత్తనాలు వేయించాలన్నారు. మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. సమావేశం అనంతరం టీఎస్‌జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శులు కృష్ణ, ఆనంద్, హనుమంత్, ఎంపీడీఓ ఆనంద్, ఎంపీపీ శరత్‌కుమార్, ఏపీఓ శ్యామ్, ఈసీ భగవాన్‌రెడ్డిను సన్మానించారు.

◆ అయ్యప్ప మాలధారణ పవిత్రమైంది

నిజాంపేట(మెదక్): అయ్యప్ప మాలధారణ ఎంతో పవిత్రమైందని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి, నిజాంపేట మాజీ జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ అన్నారు. నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఎల్లమ్మ గుడి వద్ద గురువారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సాంప్రదాయం దేశానికే కాదు, ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కాగా, అయ్యప్ప స్వాములు ఆయనను శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు గుమ్ముల భీమయ్య, తీగల చంద్రగౌడ్, నాతి లక్ష్మాగౌడ్ స్వాములు పాల్గొన్నారు.